Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 360 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily) మంగళవారం, 17 - 6 - 2025


94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## మోదీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం.. 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవం




**నికోసియా:** సైప్రస్ పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశ అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3'ను ప్రధానం చేశారు. ప్రధాని ఈ గౌరవాన్ని స్వీకరిస్తూ ఇరుదేశాల మధ్య ఉన్న స్నేహానికి ఈ అవార్డును అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ చేతుల మీదుగా మోదీ ఈ పురస్కారం అందుకున్నారు. రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్ తొలి అధ్యక్షుడు మకరియోస్ 3 పేరుతో ఈ అత్యున్నత పురస్కారాన్ని ఏర్పాటు చేశారు. సైప్రస్ ప్రభుత్వ అవార్డు 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇరుదేశాల సంస్కృతి, సోదరభావం, వసుదైవ కుటుంబ భావనకు ప్రతీక అని చెప్పారు. రెండు దేశాల మధ్య క్రియాశీల భాగస్వామ్యం కొత్త శిఖరాలకు చేరుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాల తర్వాత సైప్రస్‌లో భారత ప్రధాని ఒకరు పర్యటించడం ఇదే ప్రథమం. అవార్డు ప్రదా నానికి సంబంధించిన వీడియోను ప్రధాని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సైప్రస్ అవార్డు అందుకోవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, ఇరుదేశాల మధ్య స్నేహానికి ఈ అవా ర్డును అంకితం చేస్తున్నామని చెప్పారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం సైప్రస్ చేరుకున్న ప్రధానికి నికోస్ క్రిస్టోడౌలిడెస్ విమానాశ్రయంలో సాదర స్వాగతం పలికారు. సైప్రస్ పర్యటన అనంతరం కెనడాకు మోదీ పయనమవుతారు. అక్కడ జరుగనున్న జీ-7 సదస్సులో పాల్గొంటారు. చివరిగా క్రొయేషియాలో అధికారిక పర్యటన జరుపుతారు.

## సెర్ప్‌కు 25 ఏళ్లు.. సీఎం చంద్రబాబు ప్రశంసలు




**అమరావతి, (రాజధాని వార్తలు):** గ్రామాల ఆర్థిక అభివృద్ధి కోసం, గ్రామాల్లో పేదరిక నిర్మూలన కోసం తీసుకొచ్చిన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)ను మహిళలు ఓ ఉద్యమంలా తీసుకెళు తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. తొలుత వెలుగు అనే ఓ కార్యక్రమాన్ని చేపట్టగా.. అది కాలక్రమేనా సెర్ప్‌గా రూపాంతరం చెందిందన్నారు. సెర్ప్‌ను తీసుకొచ్చి నేటికి 25 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా గ్రామీణ మహిళలకు, సెర్ప్ ఉద్యోగులకు సీఎం అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో ముఖ్యమంత్రి పోస్ట్ చేశారు.

**చంద్రబాబు ట్వీట్ ఇదే..**

'సరిగ్గా 25 సంవత్సరాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు అనే ఒక మారుమూల ప్రాంతంలో వెలుగు అనే ఒక కార్యక్రమాన్ని ప్రారంభించాను. గ్రామీణ ప్రాంత మహిళల భాగస్వామ్యంతో గ్రామాల ఆర్థికాభివృద్ధిని సాధించడమే ఆనాటి ప్రాజెక్టు లక్ష్యం. అది కాలక్రమంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి లక్షలాది గ్రామీణ మహిళల జీవితాలలో, వేలాది గ్రామాలలో నిరంతరం అభివృద్ధి వెలుగులు నింపుతూ గ్రామీణ పేదరిక నిర్మూలనకు సెర్ప్ నిరంతరం కృషి చేస్తోంది. సెర్ప్ కార్యకలాపాలలో భాగస్వాములవుతూ... నవసమాజ నిర్మాతలై గ్రామీణ పేదరిక నిర్మూలనను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్తున్న గ్రామీణ మహిళలకు... వారిని ప్రగతి పథంలో నడిపిస్తున్న సెర్ప్ ఉద్యోగులకు ఈ సందర్భంగా అభినందనలు' అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

## షార్‌లో తీవ్రవాదులు ఉన్నారంటూ ఫోన్

**ఉమ్మడి నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలోని షార్‌లో తీవ్రవాదులు ఉన్నారంటూ గత అర్ధరాత్రి దాటాక చెన్నై కమాండ్ కంట్రోల్‌కు ఫోన్ కాల్స్ వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన నెల్లూరు జిల్లా పోలీస్ యంత్రాంగం శ్రీహరి కోటలో ఈరోజు (సోమవారం) తెల్లవారు జాము నుంచి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. సీఐఎస్ఎఫ్ బలగాలు టీంలుగా ఏర్పడి షార్ చుట్టుపక్కల కూంబింగ్ నిర్వహిస్తు న్నారు. సముద్ర మార్గాల్లో కూడా కోస్టల్ గార్డ్స్ తనిఖీలు చేశారు. షార్ మొదటి గేటు, షార్ ఉద్యోగుల కాలనీలో నాయుడుపేట డీఎస్పీ చెంచు బాబు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. షార్‌లో బాంబులు పెట్టారు, తీవ్రవాదులు ఉన్నారంటూ చెన్నై కమాండ్ కంట్రోల్ రూంకు గుర్తుతెలియని వ్యక్తులు కాల్ చేశారు. అయితే ఇది ఆకతాయిల పనా, లేకపోతే నిజంగానే ఉందా అనేది అర్థంకాని పరిస్థితి. దీంతో బలగాలు అప్రమత్తమై షార్‌లో అణువణువునా గాలిస్తున్నారు. షార్ చుట్టూ నీరు ఉంటుంది. షార్‌లోకి వెళ్లేందుకు కేవలం ఒక మార్గం మాత్రమే ఉంది. షార్‌లో రెండు వేల మంది వరకు సీఐఎస్ఎఫ్ జవాన్లు ఉంటారు. వారంతా కూడా అడవులను జల్లెడపడుతున్నారు. ప్రపంచ స్థాయిలో అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ ఎంతో వేగంగా దూసుకెళుతున్న విషయం తెలిసిందే. ఇలాంటి సమయంలో ఏదైనా ప్రమాదం జరుగుతుందా అని భావిస్తూ పెద్దఎత్తున సీఐఎస్ఎఫ్ జవాన్లు అడవుల్లో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. కంట్రోల్ రూంలు, అక్కడ ఉండే పలు కాలనీలను కూడా తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు సముద్రమార్గం ద్వారా ఎవరైనా చొరబడ్డారా అనే అనుమానంతో అక్కడ కూడా ప్రత్యే



కమైన బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. తీవ్ర ఃవాదులు ఉన్నారనే కాల్ రావడంతో షార్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిజంగా తీవ్రవాదులు చొరబడ్డారా లేదా అనే దానిపై విస్తృతంగా సోదాలు జరుగుతున్నాయి. భద్రతా బలగాలు ఎవరినీ కూడా లోపలికి పంపించకుండా మెయిన్ గేటు వద్దే క్షుణ్ణంగా సోదాలు చేస్తున్నారు. ఈరోజు మధ్యాహ్నానికి దీనిపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే షార్‌లోకి తీవ్రవాదులు చొరబడే అవకాశాలు లేవు. షార్ చుట్టూ కూడా మత్స్యకారుల గ్రామాలు, దీవులు ఉన్నాయి. ఈ గ్రామ ప్రజలు చేపల వేటతో జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు వస్తే వెంటనే షార్‌లోని సీఐఎస్ఎఫ్ జవాన్లు, స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తుంటారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో ఎవరైనా తెలియని వ్యక్తులు వచ్చారా అనేదానిపై మత్స్యకార ప్రజలను కూడా పోలీసులు అడిగి తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో షార్ చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేశారు.

## భారీ పేలుడు.. ఐదుగురు మహిళలు మృతి, తొమ్మిది మందికి గాయాలు

**ఇంటర్నెట్ డెస్క్:** ఉత్తర ప్రదేశ్‌లోని బాణసంచా కర్మాగారంలో ఈ (సోమవారం) మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘట నలో ఐదుగురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో తొమ్మిది మంది మహిళలకు తీవ్రగాయాలు అయ్యాయి. వీరందరినీ హుటాహుటిన దగ్గర్లోని ఆస్పత్రులకు తరలించారు. అటార్సి గ్రామంలోని టపాసుల తయారీ కేంద్రంలో ఈ పేలుడు సంభవించింది. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి అత్యవసర సేవలైన అగ్నిమాపక, అంబులెన్స్, పోలీసులు భారీగా చేరుకున్నారు. చనిపోయిన వారి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించారు. ఈ ఘటనపై రాజబ్‌పూర్ పోలీస్ స్టేషన్ అధికారి మాట్లాడుతూ.. 'ఈ రోజు మధ్యాహ్నం 12 గంటలకు అటార్సిలోని లైసెన్స్ పొందిన బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పోలీసులు, అంబులెన్స్, అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళా




కార్మికులు మరణించారు. తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించాం. మృతదేహాలకు పోస్ట్‌మార్టం జరుగుతోంది. పేలుడు వెనుక గల కారణాన్ని దర్యాప్తు చేస్తున్నాం' అని వెల్లడించారు.

## 22 ఆలయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రముఖ ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం శానిటేషన్, క్యూలైన్ల మేనేజ్‌మెంట్, ఇతర సౌకర్యాల పర్యవేక్షణపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ పరిధిలోని 22 ఆలయాలను ఎంపిక చేసి ఏడీసీ, ఆర్జేసీ, డీసీ కేడర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది. వీటిలో ప్రధాన ఆలయాలైన సింహాచలం, అన్నవరం, విశాఖ కనకమహాలక్ష్మీ ఆలయం, అరసవిల్లి, ద్వారకాతిరుమల, వాడపల్లి, మోపిదేవి, బెజవాడ కనకదుర్గమ్మ ఆలయంతోపాటు ఇలా మొత్తం 22 ఆలయాలను అధికారులు ఎంపిక చేశారు. దేవదాయశాఖ అధికారుల నిర్దేశం మేరకు వీరు ఆయా ఆలయాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. క్యూలైన్ల పర్యవేక్షణ, భక్తులు వేచి ఉండే గదులను పరిశుభ్రంగా ఉంచ డం, ప్రసాదం నాణ్యతపై పర్యవేక్షణ ఇలా అన్ని రకాల భాధ్యతలు చూడాలి. ఆలయాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. ఎక్కడా లోపాలు లేకుండా చూడాలి. ఏవైనా సమస్యలుంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలి. సమీక్షలు నిర్వహించి, కమిషన ర్‌కు నివేదికలు పంపాలి. దేవదాయ శాఖ నిర్దేశించిన ప్రత్యేక నిబంధనలకు అనుగుణంగానే 22 ఆలయాల్లో శానిటేషన్, క్యూలైన్ల ఏర్పాట్లు, ప్రసాదం తయారీ, అన్నదానం నాణ్యత ఉండేటట్లు చూడాలి.

## కొండపల్లి మున్సిపాలిటీ టీడీపీ కైవసం

**ఎన్‌టిఆర్ జిల్లా, (రాజధాని వార్తలు):** ఎన్టీఆర్ జిల్లాలో మరో మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకుంది. కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను తెలుగుదేశం పార్టీ దక్కించుకుంది. చైర్మన్‌గా టీడీపీకి చెందిన చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్‌గా చుట్టుకుదురు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అలాగే వైస్ చైర్‌పర్సన్‌గా ఇండిపెండెంట్ అభ్యర్థి కరిమికొండ శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు. అయితే కొండపల్లి మున్సిపాలిటీ ఎన్నికల ఫలితంపై తీవ్ర ఉత్కంఠం నెలకొంది. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దగ్గరుండి మరీ అక్కడి పరిస్థితులను పర్యవేక్షించారు. హైకోర్టు ఆదేశాల మేరకు సీల్డ్ కవర్లో తీర్పు ఫలితం అధికారుల వద్దకు వచ్చింది. ఈ క్రమంలో భారీ బందోబస్తు మధ్య సీల్డ్ కవర్‌ను తెరిచి.. ఫలితాలను ప్రకటించారు అధికారులు. కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను టీడీపీ దక్కించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మరికాసేపట్లో కొండపల్లి మున్సిపల్ చైర్మన్‌గా చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్ పర్సన్‌లుగా కరిమికొండ శ్రీలక్ష్మి, చుట్టుకుదురు శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కొండపల్లి మున్సి పాలిటీకి మొత్తం 29 వార్డులు ఉన్నాయి. ఇందులో 14 టీడీపీ, 14 వైసీపీ సరి సమానంగా కైవసం చేసుకున్నాయి. అలాగే ఒక ఇండిపెండెంట్ గెలుపొందారు. ఈ క్రమంలో ఇండిపెండెంట్ అభ్యర్థి టీడీపీకి మద్దతు ఇవ్వడం తెలుగుదేశం పార్టీ సీట్లు 15కు చేరాయి. దీంతో కొండపల్లి మున్సిపాలిటీ టీడీపీ సొంతమైంది. మరోవైపు 14 మంది వైసీపీ కౌన్సిలర్లకు గాను కేవలం 8 మంది సభ్యులు మాత్రమే హాజరవగా.. మిగిలిన వారు గైర్హాజరయ్యారు. కొండపల్లి మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి జోగి రమేష్‌కు వార్నింగ్ ఇచ్చారు. నోరు అదుపులో పెట్టుకో జోగి అంటూ హెచ్చరించారు. జగన్ సీఎం అని, జోగి ఇంకా మంత్రి అని భ్రమలో ఉన్నారని ఎద్దేవా చేశారు. కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైఎస్ చైర్మన్స్ తమ వారే అని జోగి వాగుతున్నారని మండిపడ్డారు. ఏనుగులు వెలుతుంటే కుక్కలు మొరుగుతున్నాయని... వాటికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. టీడీపీకి సంపూర్ణ మెజార్టీ ఉందన్నారు. 'సీఎం చంద్రబాబు ఇంటిని ముట్టడించే దమ్ము ధైర్యం ఉంటే రండి మేము తలుచు కంటే జోగి ఇల్లు భూస్థాపితం చేస్తాం' అని హెచ్చరించారు. ఐదేళ్లు జగన్ మూడు రాజధానులు అని నాటకం ఆడారని ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ విమర్శలు గుప్పించారు.

## దారుణం.. ఆస్తి కోసం కన్నకూతురినే...

**అనంతపురం, (రాజధాని వార్తలు):** జిల్లాలోని కంబదూరు మండలం కురాకులపల్లిలో కిడ్నాప్ కలకలం రేపింది. కన్న తల్లిదండ్రులే కూతురిని కిడ్నాప్ చేశారు. ఎస్జీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న యువతి ఇటీవల ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో తల్లిదండ్రులు ఆమెపై కక్ష పెంచుకున్నారు. భర్తతో కలిసి యువతి బైక్‌పై వెళుతుండగా కిడ్నాప్ చేశారు. పథకం ప్రకారం 11 మందితో కలిసి యువ తిని కిడ్నాప్ చేశారు. ఈ కిడ్నాప్‌ను పోలీసులు చేధించారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉన్న తిరుపతమ్మ అనే యువతిని సొంత కుటుంబసభ్యులే కిడ్నాప్ చేశారు. ఆస్తి కోసం కిడ్నాప్ చేయడంతో పాటు కుటుంబసభ్యుల ఆమోదం లేకుండా మరొకరిని వివాహం చేసుకుందనే ఆగ్రహంతో తిరుపతమ్మను కిడ్నాప్ చేసి బెంగళూరుకు తరలించారు. బెంగళూరులోని బంధువుల ఇంట్లో ఉంచారు. తిరు పతమ్మ పేరు మీద ఉన్న ఆస్తులను కుటుంబ సభ్యులపై ట్రాన్స్‌ఫర్ చేయాలని ఒత్తిడి తీసుకొచ్చారు. ఆస్తులను రాసియ్యకపోతే చంపుతామంటూ కూడా తీవ్రస్థాయిలో బెదిరింపులకు దిగారు. దీంతో మీరు చెప్పినట్టుగానే ఆస్తులను ట్రాన్స్‌ఫర్ చేస్తానని, కళ్యాణదుర్గం వెళ్లాక తన పేరుతో ఉన్న ఆస్తులతో పాటు ఇతరత్రా ఆస్తులను కూడా ట్రాన్స్‌ఫర్ చేస్తానంటూ కుటుంబ సభ్యులకు చెప్పింది యువతి. అందులో భాగంగా బెంగళూరు నుంచి కళ్యాణదుర్గంకు తిరుప తమ్మను కుటుంబ సభ్యులు తీసుకు వచ్చారు. అయితే అప్పటికే తిరుపతమ్మ కిడ్నాప్ కేసు నమోదు అవడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించగా.. ఓ వాహనంలో యువతితో పాటు కుటుంబ సభ్యులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్‌పై పోలీసులు లోతుగా విచారించడంతో కిడ్నాప్ వెనక ఉన్న తతంగం మొత్తాన్ని కూడా వెలికి తీశారు. తిరుపతమ్మ తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులే ఆస్తి కోసం ఆమెను కిడ్నాప్ చేసినట్లు పోలీసుల విచారణలో బయటపడింది.

**పోలీసులు ఏమన్నారంటే...**

'యువతికి 32 సంవత్సరాలు వచ్చినప్పటికీ తల్లిదండ్రులు పెళ్లి చేయలేదు. కూతురు పెళ్లి చేస్తే జీవనాధారం పోతుందని భావించిన వారు పెళ్లి చేయకుండా ఇంటి వద్దే ఉంచుకున్నారు. పెళ్లి చేయమని స్వయంగా అమ్మాయి అడిగితే వాళ్ల చెల్లెలి భర్తను పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో తల్లిదండ్రుల ప్రవర్తన విసిగిపోయిన సదరు యువతి తనను 20 ఏళ్లుగా ప్రేమిస్తున్న చిన్ననాటి మిత్రుడు తిప్పేస్వామిని పెళ్లి చేసుంది. కుమార్తె వివాహ విషయం తెలుకున్న తల్లిదండ్రులు ఆమెపై కక్షతో కిడ్నాప్ చేయాలని ప్రణాళిక చేశారు. అనుకున్న ప్రకారం పక్కా పథకంతో కూతురును కిడ్నాప్ చేసి బంధించారు. కూతురిని హింసించి ఆమె వద్ద ఉన్న సెల్‌ఫోన్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డును లాక్కున్నారు. ఆస్తి రాసివ్వాలని బెదిరించారు' అని పోలీసులు తెలిపారు. యువతిని కిడ్నాపర్ల చెర నుంచి విడిపించామని.. వారి వద్ద నుంచి కత్తి, బైక్‌ను సీజ్ చేసినట్లు కాప్స్ వెల్లడించారు.

# ఇచ్చిన మాట కట్టుబడే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం

## - తల్లికి వందనం పేద ప్రజలకు వరం : జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి శ్రావణి రెడ్డి



**గూడూరు, (రాజధాని వార్తలు):** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు పరిచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా విద్యార్థుల ఉన్నతి కోసం కృషి చేసేందుకు ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అంతమంది విద్యార్థులకు 15000 రూపాయలు తల్లికి వందనం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం జూన్ 12వ తేదీన ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంత మందికి తల్లికి వందనం కార్యక్రమం కింద రూ.15 వేలు ఇస్తుంటే వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారని విమర్శించడం సిగ్గుచేటు అన్నారు. రూ.2 వేలు లోకేష్ బాబు జేబుల్లోకి పోయాయంటూ వైసీపీ నేతలు దిగజారుడు ఆరోపణలు చేయడం సిగ్గుమాలిన వ్యవహారం అన్నారు. వైసీపీ పాలనలో రూ.13 వేలు ఇచ్చారు. అంటే రూ.2 వేలు మీ జేబుల్లోకి పోయాయా? తాడేపల్లి ప్యాలస్‌కు చేరాలని పేర్కొన్నారు. వైసిపి పాలనలో 42 లక్షల మందికి మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తుందన్నారు. కుటుంబంలో ఒక్కరికే అనే షరతు పెట్టి పేద, మధ్య తరగతి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మీరు మానసికంగా వేధిం పులకు గురి చేసిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. "కేజి నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తాను.. ఎంతవరకు చదవుకుంటే అంతవరకు చదివిస్తాను.. మేనమామగా చెబుతున్నాను" అని మాటలు చెప్పి బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు చెందిన 12 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసింది మీరు కాదా అని గుర్తు చేశారు. 2019 ఎన్నికల ప్రచారంలో "మీ ఇంట్లో ఇద్దరు పిల్లల్ని బడికి పంపండి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున ఇస్తాము" అంటూ ప్రచారం చేసి మోసం చేయలేదా అని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక ప్రతి కుటుంబంలో ఒక్క విద్యార్థికే రూ.13 వేలు ఇస్తామంటూ నాలుక మడతబెట్టారన్నారు. 18,55,760 మంది తల్లులకు ఒక్కరే సంతానం. ఆ బిడ్డనే తన ప్రపంచంగా, తన ఆశలకు నిలువుటద్దంగా భావించేవారు ఆ తల్లులు. 13,000 జమ అయ్యింది అని సందేశం వచ్చినప్పుడు, ఆ తల్లి కళ్లలో మెరిసే మెరుపు, తన బిడ్డ చదువుకు, భవిష్యత్తుకు వేసిన తొలి అడుగుగా భావిస్తుంది. ఆ లక్షలాది తల్లుల కళ్ళల్లో ఆనందాన్ని, గుండెల్లో భారాన్ని దింపి భరోసాను నింపుతోందన్నారు. 14,55,322 మంది తల్లులకు ఇద్దరేసి బిడ్డలు. అంటే 29,10,644 మంది చిన్నారులు. ఇద్దరు పిల్లలను పెంచడం, వారి అవసరాలు తీర్చడం ఎంత కష్టమో ఆ తల్లులకే తెలుసు. 26,000 డబ్బు జమ అయినప్పుడు, "కష్టాలు తీరాయి, ఇద్దరినీ బాగా చూసుకోగలను" అనే తృప్తి వారి ముఖాల్లో స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. 2,10,684 మంది తల్లులకు ముగ్గురు పిల్లలు (మొత్తం 6,32,052 మంది పిల్లలు), అలాగే 20,053 మంది తల్లులకు నలుగురు పిల్లలు (మొత్తం 80,212 మంది పిల్లలు) ఉన్నారు. ఇంత మంది పిల్లలను పెంచే తల్లులు పడే కష్టం వర్ణనాతీతం. ఇంట్లో ఎక్కువ మంది బిడ్డలుంటే అంత మందికి తల్లులకు వందనం చెప్పాలి. వారి కష్టం, త్యాగం గొప్పవి. వారికి 39,000/–, 52,000/– బ్యాంకు ఖాతాలో జమ అయినప్పుడు, అది వారికి కేవలం డబ్బుగా కనిపించదు. అది వారి కన్నీళ్లను తుడిచే వరద హస్తంగా.. పిల్లలు పస్తులు వుండకుండా, వారి చదువులు ఆగిపోకుండా చూసుకోగలుగుతాం అని కలిగే ఊరట వెలకట్టలేనిది అన్నారు. తల్లికి వందనం అనేది డబ్బుగా కన్నా.. వారి కళ్ళల్లో కనిపించే ఆనందం, గుండెల్లో నిండిన ప్రేమ, భవిష్యత్తుపై వారికి కలిగే నమ్మకం, మన మనసుతో చూస్తే మనకూ ఓ తృప్తి. ఇది లక్షలాది కుటుంబాల్లో వెలిగించిన ఆశల దీపం. ఈ క్రెడిట్ మెసేజ్‌లు కేవలం బ్యాంక్ లావాదేవీలు కావు. తల్లుల ముఖాల్లో కనిపించే ఆ ప్రశాంతతే, ఈ పథకం విజయాన్ని చాటుతోంది. సంతానం ఇక భారం కాదు అని అందరూ గర్వంగా చూస్తుంటే.. సంతోషాన్ని ఇచ్చే రోజులు చంద్రబాబు నాయుడు, ఆయన బిడ్డ మన కోసం తెచ్చారు అనే భావన తల్లుల్లో కలుగుతుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇస్తున్న తల్లికి వందనంపై విమర్శలు మాని ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు.

# చంద్రగిరి నియోజకవర్గంలో మాఫియా రాజ్యమేలుతోంది

## - ఆలయాల విధ్వంసంపై చెవిరెడ్డి మహిత్ రెడ్డి ఫైర్





**తిరుచానూరు, (రాజధాని వార్తలు):** దేవాలయాలను ధ్వంసం చేయడం సనాతన ధర్మమా. భూములు కొట్టేయడానికి ఆలయాలు ధ్వంసం చేస్తారా. అసలైన దోషులను వదిలేయడం దేనికి సంకేతం..? ఇదంతా ఎమ్మెల్యే నాని అనుచరులే చేస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో మాఫియా రాజ్యమేలుతోంది.. మట్టి మాఫియా, ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా బరితెగించింది.. ఆ మాఫియాను నడిపిస్తున్న ఏకైక వ్యక్తి స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని.. ఆయనకు తెలియకుండానే ఆలయాలు ధ్వంసం జరిగాయా..? అలాగే అయితే కనీసం చూడటానికి కూడా ఎందుకు రాలేదు.. స్థానికులు మీకు ఓట్లు వేసింది పురాతన ఆలయాలను ధ్వంసం చేయించడానికా..? దేవాలయాలను ధ్వంసం చేయడం సనాతన ధర్మమా..? భూములు కొట్టేయడానికే కదా ఆలయాలు ధ్వంసం చేస్తోంది.. ఆలయాల విధ్వంసంలో అసలైన దోషులను వదిలేయడం దేనికి సంకేతం.." అంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి నియోజకవర్గం సమన్వ యకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఫైర్ అయ్యారు. తిరుచానూరు పంచాయతీ దామినేడు గ్రామం సమీపంలోని పురాతన కాలం నాటి నాగాలమ్మ ఆలయాన్ని టీడీపీకి చెందిన క్రిష్ణమూర్తి నాయుడు, ఆయన అనుచరులు అర్ధరాత్రి ధ్వంసం చేయడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధ్వంసం చేసిన ఆలయం వద్ద నిరసనకు దిగారు. ఆ గ్రామస్తులకు మద్దతుగా వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నిలబడి ఆలయాల విధ్వంసంపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ప్రజలు ఎందుకు ఓట్లు వేశామా..? అని బాధపడే పరిస్థితికి తీసుకువచ్చారని ఆరోపించారు. మొన్న తిరుచానూరు పంచాయతీ పార్టీ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి వారాహి అమ్మవారి ఆలయాన్ని ధ్వంసం చేస్తే ఆయనపై కేసులు పెట్టి అరెస్టు చేయకుండా వదిలేయడం, సంబంధం లేని వ్యక్తులను కేసులో పెట్టి అరెస్టు చూపించడం ఎంత వరకు న్యాయం..? దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్టుగా అధికారులు, అధికార పార్టీ నేతలు ప్రజల ఆస్తులను దోచేస్తున్నారని విమర్శించారు.

**అధికారులకు తెలిసే జరుగుతోంది**

ఆలయాలు విధ్వంసం మండల స్థాయిలో వున్న అధికారులకు అన్నీ తెలిసే జరుగుతోందన్న అనుమానం చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వ్యక్తం చేశారు. తిరుపతి రూరల్ తహశీల్దారు, డిప్యూటీ తహశీల్దారు మోహన్‌లు అక్రమార్కులకు వంతపాడుతూ ఆలయాల విధ్వంసంకు సహకరించి వుంటారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మనుషులకే కాదు దేవాలయాలకు కూడా రక్షణ కరువైందన్నారు. వారాహి అమ్మవారి భక్తుడునని, సనాతన ధర్మం కాపాడుతానంటూ జనంలోకి వచ్చిన పవన్ కల్యాణ్ ఇంత జరుగుతుంటే ఏమయ్యారని ప్రశ్నించారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రశాంతంగా వున్న చంద్రగిరి నియోజకవర్గంను ఒక ఏడాదికే మాఫియాలకు అడ్డాగా మార్చేశారన్నారు. అమ్మవారి సన్నిధిలో ఆలయాలపై దాడులు జరుగుతుంటే స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని ఎక్కడ దాక్కున్నారు..? అని ప్రశ్నించారు. ఆలయాల విధ్వంసంలో ఆయన పాత్రలేదను కుంటే ఆయన ప్రధాన అనుచరుడు కిషోర్‌రెడ్డిని పోలీసులకు అప్పగించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. వరుసగా ఆలయాలపై దాడులు జరుగుతుంటే పోలీసులు స్పందించకపోవడం దారుణమని, విధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో బాధితులతో కలసి కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

# మోకాళ్లపై కార్మికుల నిరసన



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె 39వ రోజుకు చేరింది. పెద్దాపురం మున్సిపాలిటీ వద్ద నిరసనలో ఉన్న ఉద్యోగులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. సిబ్బంది వేతనాలు పెంచాలని, 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుంకర నాగేశ్వరరావు, బాసిన భద్రరావు, కే.వెంకటరమణ, ఆకుల రామ కృష్ణ వాకాడ భాస్కర్, సుంకర సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ ఆధ్వర్యంలో విమాన ప్రమాద మృతులకు నివాళి




**శ్రీకాళహస్తి రూరల్, (రాజధాని వార్తలు):** అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి ఎన్‌డిఏ కూటమి నాయకులు స్థానిక పెళ్ళి మండపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టే సాయి మాట్లాడుతూ అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం వార్త యావత్ దేశాన్ని శోకసంద్రంలో ముంచింది అని, ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు జనసేన పార్టీ తరపున ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాం అని తెలిపారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియ చేశారు. అలాగే విమాన ప్రమాద కారణాలపై సమగ్ర విచారణ జరిపి, భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం మరియు సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టే సాయి, తెలుగుదేశం నాయకులు మిన్నల్ రవి, జనసేనపార్టీ నాయకులు కుమార్, మహేష్, గరికపాటి చంద్ర, పగడాల ప్రతాప్, చంద్ర, చిరంజీవి, మణి, మహేష్, రాఘవ, సురేష్, మహిళా నాయకురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

# చదువుల "తల్లికి వందనం" ఒక వరం...!

## - ఆనందంలో పాలు పంచుకున్న ఎమ్మెల్యే, డిసిసిబి చైర్మన్‌లు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** చదువుల్లో రాణించేందుకు విద్యార్థులకు "తల్లికి వందనం" ఒక వరంగా ఉందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు అన్నారు. పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట పట్టణం 31వ వార్డు భాస్కర కాలనీకి చెందిన ముస్లిం మైనార్టీ కుటుంబనికి చెందిన గృహిణికి "తల్లికి వందనం" పథకం ద్వారా ఒకేసారి ఐదుగురు పిల్లలకు నగదును కూటమి ప్రభుత్వం ద్వారా ఖాతాలోకి జమ అయింది. దానితో ఆ కుటుంబంలో హర్షాతిరేకాలు వెల్లువెత్తడంతో ఆ కుటుంబాన్ని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప, డీసీసీబీ చైర్మన్, జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి (బాబు)లు కుటుంబాన్ని కలిసి విద్యార్థులను పలకరించారు. విద్యార్థులను ఉన్నత మైన చదువు చదివించాలని తల్లిదండ్రులకు సూచించి విద్యార్థులను వారు ఆశీర్వదించారు. కొంత సమయం గడిపి వారు కుటుంబంతో సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సామర్లకోట పట్టణ అధ్యక్షులు సరోజ వాసు, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు అడబాల కుమారస్వామి, కౌన్సిలర్ బలుసు వాసు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, నిమ్మకాయల కిరణ్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మంచెం సాయి బాబు, నాయకులు మడగల శ్యామ్ కుమార్, చినబాబు, తుమ్మల ప్రసాద్, అత్తిలి కృష్ణ, అత్తిలి సతీష్, తుమ్మల శ్రీను, కమిరెడ్డి సాయి నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా కుమార్ మండలం బిర్లా పుట్టినరోజు వేడుకలు




**తిరుపతి, (రాజధాని వార్తలు):** ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ పద్మ భూషణ్ డాక్టర్ కుమార మంగళం బిల్లా పుట్టినరోజు వేడుకలు గాంధీ రోడ్డులోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్టు కార్యాల యం వద్ద డాక్టర్ పిసి రాయలు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిటిడి పాలకమండలి సభ్యులు జి భాను ప్రకాష్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ హాజరై డాక్టర్ పిసి రాయలుతో కలసి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం అతిథులతో కలిసి సుమారు వెయ్యి మంది పేద ప్రజలకు అన్నదానం వితరణ చేశారు. ఈ సందర్భంగా పిసి రాయులు మాట్లాడుతూ కుమార్ మంగళం బిర్లా దేశం గర్వించదగ్గ వ్యాపారవేత అని కొనియాడారు. 28 ఏళ్ల వయ సులో ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించి ప్రపంచ వ్యాప్తంగా ఆ సంస్థను విస్తరింపజేసి అనేక రంగాలలో సుమారు రెండు లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. వారు పూర్వీకులు నుంచి దేశ సేవ చేశారని, వారి కుటుంబానికి శ్రీవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. భాను ప్రకాష్ రెడ్డి సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ పి సి రాయలు అనేక సేవా కార్యక్రమాలతో ప్రజలకు అండగా నిలుస్తూ నిరంతరం సేవ చేస్తున్నారని కొనియాడారు. ప్రజలకు మరింత సేవ చేసేందుకు ఆయనకు శ్రీవారి ఆశీస్సులు వెండిగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండి మధుసూదన్ రెడ్డి, బిజెపి నాయకులు జీవన్, కస్తూర్బా ట్రస్టు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కరపలో ముందస్తు యోగా ట్రైల్ రన్





**కరప, (రాజధాని వార్తలు):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర వేడుకలలో భాగంగా కరప గ్రామంలో ముందస్తు యోగా ట్రైల్ రన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక చిరంజీవి కళ్యాణ మండపంలో కరప మండల అభివృద్ధి అధికారి (ఎంపీ డీవో) మట్టపర్తి అనుపమ ఆధ్వర్యంలో పాతర్లగడ్డ, గొర్రిపూడి తదితర గ్రామాల్లో కూడా యోగా ట్రైల్ రన్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. ఈ తరహా యోగా కార్యక్రమాల ద్వారా గ్రామస్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతుందని అనుపమ ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో యోగా ట్రైల్ రన్స్ విజయవంతంగా పూర్తయ్యాయని ఎంపీడీవో అనుపమ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# జోరుగా ఏరువాక పనులు ప్రారంభం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్ల కోట మండలంలో ప్రస్తుత ఖరీఫ్ (సార్వా) సీజన్‌కు సంబంధించి ఏరువాక పనులను రైతులు ప్రారం భించారు. మండలంలో వరి సాగు పనులను రైతులు శ్రీకారం చుట్టారు. ప్రతి ఏటా ఏరువాక పూర్ణమికి సాగు సన్నాహాలు చేసి, తొలకరి పనులను రైతులు అయితే ఈ ఏడాది జూన్ 10వ తేదీ దాటే వరకు ఎండల తాపం కొనగాయి. ప్రస్తుతం వాతావరణం చల్లబడి వర్షాలు పడు తుందటంతో పాటు సాగుకు జలాలు అందుబాటులో ఉండటంతో రైతులు ఏరువాక పనులను ప్రారంభించారు. మండలంలోని జి మేడపాడు, వేట్లపాలెం, హుస్సేన్ గ్రామాలు సహా పలు ప్రాంతాల్లో రైతులు నాట్లు వేసేందుకు నారుమడులు సిద్ధం చేస్తున్నారు.

# నాన్న కష్టాలను ఎంత బాగా చెప్పావ్ పూరీ




ప్రతి వారం పూరి మ్యూజింగ్స్ అభిమానులకు బోలెడంత సమాచారాన్ని చేరవేయడమే గాక, చాలా ఎమోషనల్ విషయాలను వినిపించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. దర్శకుడు పూరి జగన్నాథ్ తన అనుభవ పాఠాల నుంచి చాలా విషయాలను చెబుతుండటంతో అవి జనాలకు ఇట్టే కనెక్టయిపోతున్నాయి. 15 జూన్ ఫాదర్స్ డే సందర్భంగా పూరి నాన్న గురించి చెప్పిన సంగతులు వాస్తవికతకు అద్దం పట్టాయి. నాన్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. మౌనంగా అన్నిటినీ భరించేది నాన్న! అంటూ ఎన్నో విషయాలను చెప్పారు పూరి. అతడి మాటల సారాంశం ఇలా ఉంది. నాన్న ఆల్వేస్ అండర్ రేటెడ్.. నాన్న మనకోసం ఏం చేసాడో మనకు తెలీదు.. ఎన్ని కష్టాలు పడ్డాడో మనకు తెలీదు.నాన్న ఎన్ని కష్టాలు పడినా ఏ సమస్య ఉన్నా ఎవరికీ చెప్పడు. పిల్లలు పెళ్లానికి అసలే చెప్పడు అమ్మలా ప్రేమను ఎక్స్ ప్రెస్ చేయడం నాన్నకు తెలీదు. బిజీగా ఉన్న నాన్న ఎప్పుడో ఇంటికి వస్తాడు. రాత్రి ఎప్పుడో ఇంటికి వచ్చి మంచంపై నిదురపోతున్న పిల్లల వైపు చూస్తాడు. ఎప్పుడూ పనేనా.. కాస్త ఇంటి పట్టున ఉండొచ్చు కదా అని చిరాకు పడే అమ్మ మాట వింటుంటాడు. పిల్లలు కూడా నాన్నను మిస్ అవుతుంటారు. నిజానికి నాన్నను నాన్నే మిస్ అవుతుంటాడు.

పెళ్లయి పిల్లలు పుట్టగానే నాన్న జీవితం నాన్న చేతిలో ఉండదు. మనందరి కోసం నాన్న పగలు రాత్రి పని చేయాలి. చదువులు.. సమస్యలు.. చుట్టాలు.. పండగలు.. హాస్పిటల్స్.. బర్త్ డేలు ... వీటన్నిటితో నాన్న నలిగిపోతాడు.. యాంగ్జయిటీ .. షుగరు.. పెరాలిసిస్ .. హార్ట్ ఎటాక్ ఇలా ఎన్నో ..వృద్ధాప్యం వచ్చిందా అనిపిస్తుంది. లోపల లోపల కరిగిపోతాడు. డాక్టర్‌ని కలిసిన విషయం కూడా నాన్న చెప్పడు. పిల్లలు పెద్దవాళ్లవ్వాలని అప్పులు చేసి అయినా చదివిస్తాడు. ఇంకా ఎన్నిటినో భరిస్తాడు.. అంటూ పూరి చాలా విషయాలను పూరి మ్యూజింగ్స్‌లో చెప్పారు. ఆస్తులు అమ్మి అయినా పెళ్లిళ్లు చేస్తాడు. ఎండ వానల్లో నిలుచుంటాడు. వందల సార్లు అమ్మ ఏడ్వడం చూస్తారు. కానీ నాన్న ఏడ్వడం చూడరు. కానీ నాన్న కూడా ఏడుస్తాడు. ఎక్కడో ఒంటరిగా కూచుని ఏడుస్తాడు. పిల్లలు ఎదిగేప్పటికీ అన్నీ అమ్ముకుని అంతా ఆరిపోయి ఉంటాడు.. అంటూ చాలా వాస్తవాలను వివరించే ప్రయత్నం చేసారు పూరి.

# ఈ సంవత్సరంలోనే జాన్వీ పెళ్లి?



తారల జీవితాలపై కొందరు జ్యోతిష్కుల ప్రకటనలు కొన్నిసార్లు వివాదాస్పదం అవుతున్నాయి. అక్కినేని కుటుంబంపై వేణుస్వామి అనే హైదరాబాదీ జ్యోతిష్కుడు సంచలనం సృష్టించే విషయాలను చెప్పడం, అతడిపై చర్యలు తీసుకోవడం తెలిసిందే. అక్కినేని నాగచైతన్య- శోభిత జంటపైనా వేణుస్వామి సంచలన వ్యాఖ్యలు చేయగా, అతడు చివరికి క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే జాన్వీ కపూర్ ఈ ఏడాది పెళ్లాడేస్తుందంటూ ఒక జ్యోశ్యుడు చేసిన వ్యాఖ్యలు చర్చగా మారాయి. జాన్వీ ఈ ఏడాది పెళ్లి చేసుకుంటే చాలా బావుంటుంది.. ఒకవేళ ఇప్పుడు అవ్వకపోతే జాన్వీకి 33 వయసులో పెళ్లవుతుందని కూడా అతడు సెకండ్ ఆప్షన్ ఇచ్చాడు. జాన్వీ వైవాహిక జీవితం చాలా బావుంటుందని, ఒక్కోసారి గ్రహగతులు మారే క్రమంలో సంసారంలో కొంత ఇబ్బంది ఎదురయ్యేందుకు అవకాశముందని కూడా అంచనా వెలువరించారు. సిద్ధార్థ్ కన్నన్ యూట్యూబ్ చానెల్ ఇంటర్వ్యూలో ఒక జ్యోతిష్కుడి అంచనా ఇది. అలాగే జాన్వీ కపూర్ స్టార్ డమ్ అసాధారణంగా వెలిగిపోతుందని, తన సహచరుల కంటే జాన్వీ చాలా ముందుంటుందని కూడా పాజిటివ్ నోట్ చెప్పాడు. 2026 మధ్యకాలం తర్వాత జాన్వీ గొప్ప స్టార్‌గా ఎదుగుతుందని అన్నాడు. అయితే ఇలాంటి జ్యోతిష్య అంచనాలను నమ్మదగినవిగా అనిపించవు. ఓవైపు పెళ్లి ఈ ఏడాది చివరిలో చేసుకోవాలని అంటాడు. కానీ 33 వయసులో పెళ్లవుతుందని ఎలా చెబుతాడు? వైవాహిక జీవితం బావుంటుందని అంటాడు. అదే సమయంలో సూర్యచంద్రులు, గ్రహాలు తేడా కొడితే! అంటాడు. అందువల్ల జ్యోతిష్యాన్ని నమ్మాలో నమ్మకూడదో కొంత గందరగోళం నెలకొంటుంది. సెలబ్రిటీల కుటుంబ నేపథ్యం, ధనబలం ఇతర బాలాల దృష్ట్యా కొన్ని అంచనాలు నిజం కావొచ్చు. చాలా వరకూ నిరాధారమైన వ్యాఖ్యలు విన్నప్పుడు ఇదెలా సాధ్యం? అనిపించక మానదు. జాన్వీ ఇప్పటికే శిఖర్ పహారియా అనే రాజకీయ నేపథ్యం ఉన్న కుర్రాడితో ప్రేమలో ఉంది. జ్యోతిష్కుడి ప్రకారం.. ఈ ఏడాది పెళ్లాడేస్తుందో లేదో వేచి చూడాలి. అయినా మనిషి భవిష్యత్ వాణి ఎలా చెప్పగలరు? గ్రహగతులు, పుట్టిన తేదీల ఆధారంగా దీనిని వందశాతం పక్కాగా చెప్పగలిగే జ్యోతిష్యుడు ఇంకా పుట్టలేదు. కొన్ని స్పెక్యులేషన్స్ నిజాలు కావొచ్చు. రొమానియన్ బాబా వంగా చెప్పినట్టు, వీరబ్రహ్మేంద్ర స్వామి చెప్పినట్టు జ్యోతిష్యం చెప్పగలరా వీరంతా?

# రాజు గారిలా చర్చించే దమ్ము మిగతా వాళ్లకు ఉందా?



సినిమా నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోయింది. స్టార్ హీరోతో సినిమా అంటే 30 కోట్లు హీరో పారితోషికంగానూ పోతుంది. ఈ విషయంలో హీరోలంతా ఆలోచించి పారితోషికాలు తీసుకోవాలి అన్న అంశం చాలాసార్లు చర్చకొచ్చింది. కొంత మంది నిర్మాతల పరిస్థితిని అర్దం చేసుకుని తక్కువ చేసుకున్న వాళ్లు ఉన్నారు. ఇదే సమయంలో నిర్మాతలంతా హీరోలతో గుడ్డిగా సినిమా చేయొద్దని..కథాబలం అర్దం చేసుకుని పెట్టిన పెట్టుబడికి రికవరీ ఏమేర ఉంటుందో? ప్రీ బిజినెస్ ఇలా అన్ని లెక్కలు వేసుకుని సినిమా తీయా లని నిర్మాత దిల్ రాజులాంటి వారు తమ అనుభవాలన్ని చెప్పే ప్రయత్నం చేసారు. ఇదంతా పాత కథ. అయితే ఓ హీరోని కన్విన్స్ చేసి తనకు అనుకూలంగా మార్చుకుని ఆరోగ్య కరమైన వాతవరణంలో తాను సినిమా తీయగలనని దిల్ రాజు ధీమా వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాను ఏ హీరోతో సినిమా తీసిన ఆ హీరోని దగ్గర కూర్చోబెట్టుకుని ఆ సినిమాకు సంబంధించిన బడ్జెట్ విషయాలన్ని చర్చిస్తానని..దాంతో వారు కూడా కన్విన్స్ అవుతారని..వాళ్లను ఆ రకంగా ఒప్పించే నమ్మకం తనకు ఉందని ధైర్యంగా చెప్పారు. లాభ నష్టాలను అన్నింటిని బేరీజు వేసుకునే తాను సినిమా తీస్తానన్నారు. మరి రాజు గారిలో హీరో ముందు కూర్చుని ధైర్యంగా చర్చించే దమ్ము మిగతా నిర్మాతలకు ఉందా? రాజుగారిలా సినిమా గణాంకాలను చెప్పి హీరోలను కన్విన్స్ చేయగలరా? అంటే ఆ సన్నివశం ఇండస్ట్రీలో మరో ఇద్దరు ముగ్గురు నిర్మాతల వద్ద తప్ప అందరికీ వద్ద లేదనే చెప్పాలి. సురేష్ బాబు, అల్లు అరవింద్‌లాంటి వారు మాత్రమే రాజుగారిలా డిస్కస్ చేయగలరు. చాలా మంది నిర్మాతలు హీరోల మాటలు వినడం తప్ప...వాళ్లకు ఎదురెళ్లి మాట చెప్పే పరిస్థితి ఉండదు. ఇది మారి నప్పుడే నిర్మాత నష్టాల నుంచి బయట పడగలడు. అంత వరకూ హీరోల పారితోషికాలు అంతకంతకు పెరుగుతూనే ఉంటాయి.

# వాళ్లిద్దరి మధ్యలో నెల్సన్ దూరుతున్నాడా?



యంగ్ టైగర్ ఎన్టీఆర్ కోసం త్రిముఖ పోరు తప్పదా? ఆ ఇద్దరి మధ్యలోకి మరో సంచలన డైరెక్టర్ రంగం లోకి దిగుతున్నాడా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తుంది. ప్రస్తుతం తారక్ హీరోగా డ్రాగన్ చిత్రాన్ని ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా వచ్చే ఏడాది ముగింపులో రిలీజ్ కానుంది. అంతకు వరకూ తారక్ కొత్త ప్రాజెక్ట్ మొదలు పెట్టే అవకాశం లేదు. అయితే తారక్ కోసం ఇప్పటికే ఇద్దరు దర్శకులు కర్చీప్ వేసారు. డ్రాగన్ పూర్తయిన వెంటనే దేవర 2 మొదలు పెట్టాలని కొరటాల శివ సీరియస్‌గా పని చేస్తున్నాడు. 'దేవర' డివైడ్ టాక్ రావడంతో ఆ లెక్కలు 'దేవర 2' తో సరి చేయాలని కసి మీద ఉన్నాడు. తనని నమ్మి తారక్ అవకాశం ఇస్తే ఫలితం తేడాగా రావడంతో ఎలాగైనా ఆ రిమార్క్ చెరుపు కోవాలని చూస్తున్నాడు. కొరటాల లాగే బుచ్చిబాబు కూడా తదుపరి చిత్రాన్ని తారక్ తోనే తీయాలని కసి మీద ఉన్నాడు. ప్రస్తుతం రామ్‌చరణ్‌తో పెద్ది సినిమా తీస్తున్నా ఆ సినిమాని వీలైనంత త్వరగా పూర్తి చేసి తారక్ స్క్రిప్ట్‌పై పని మొదలు పెట్టాలని చూస్తున్నాడు. ఎందుకంటే బుచ్చిబాబుకు తారక్ రూపంలో ఎదురు దెబ్బ తగిలింది. అన్ని అనుకున్నట్లు జరిగితే తారక్‌తోనే తన రెండవ సినిమా సెట్స్‌లో ఉండాలి. కానీ చివరి నిమిషంలో స్క్రిప్ట్ కుదరలేదు.

అప్పటి నుంచి తారక్‌ను మెప్పించే స్క్రిప్ట్‌పై పని చేస్తున్నాడు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తారక్‌తోనే తర్వాత సినిమా ఉంటుందని ప్రకటన కూడా చేసాడు. సరిగ్గా ఇప్పుడు వీళ్లిద్దరి మధ్యలోకి తమిళ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ చేరాడు. ప్రస్తుతం సూపర్ స్టార్ రజనీ కాంత్ హీరోగా దిలీప్ జైలర్ 2 తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా అనంతరం తారక్‌తోనే తదుపరి సినిమా చేయాలని ప్రయత్నాలు మొదలు పెట్టాడని సమాచారం. ఇదే నిజమైతే ముగ్గురి మధ్య తారక్ నిర్ణయం తీసుకోవడం సవాల్‌గా మారుతుంది.

# "అన్నదానం" మహాపుణ్యకార్యం

## - బిహెచ్ఆర్సీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అంధవరపు జ్యోతిర్మయి




**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** "అన్నదానం" మహాపుణ్యకార్యమని, బిహెచ్ఆర్సీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అంధవరపు.జ్యోతిర్మయి సోమవారం అన్నారు. అన్నవితరణలో భాగముగా బిహెచ్ఆర్సీ వైస్ ఛైర్పర్సన్ డా.ఎన్.ప్రభు మాట్లాడుతూ నగరంలో కొత్తరోడ్డు, డే అండ్ నైట్, అరసవల్లి దేవాలయ ప్రాంగణం, మిల్ జంక్షన్, పాత బస్ స్టాండ్‌తోపాటు పలు ముఖ్య కూడలిలో నిరుపేదలకు భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జిల్లా మహిళా అధ్యక్షురాలు అంధవరపు జ్యోతి అందించిన సహకారంతో నిర్వహించామన్నారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు అంధవరపు జ్యోతి మాట్లాడుతూ అన్నప్రసాద వితరణ మహోత్తరమని, అందులోనూ స్వయంపాకంతో ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని సుమారు వంద మందికి పైగా నిరుపేదలకు అందించి ఆకలి తీర్చటం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజులలో బిహెచ్ఆర్సీ తరపున అన్నదానాలతో పాటు, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించటమే ధ్యేయంగా, అనేక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు.

ఈ అన్నవితరణ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పిఎన్. మణిశర్మ, జిల్లా మహిళా అధ్యక్షురాలు కె.సౌజన్య పట్నాయక్, బిహెచ్ఆర్సీ సభ్యుల బృందం, సేవకులు ఉర్లం శివతేజ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులతో అన్నవితరణ హర్షణీయం

## - లయన్ ఉర్లం శివతేజ పట్నాయక్ - నిత్యాన్నదాతగా స్టార్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.విజయకుమార్



**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** చిన్నారులతో అన్నవితరణ చేపట్టటం హర్షణీయమని, నిత్యాన్నదాతగా స్టార్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.విజయకుమార్ నిలుస్తున్నారని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన ఉపాధ్యక్షులు ఉర్లం. శివతేజ పట్నాయక్ అన్నారు. ఫాదర్స్ డే సందర్భంగా స్టార్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.విజయకుమార్ చిన్నారులతో అన్నప్రసాద వితరణ నగరంలో నిస్సహాయకులకు అందించి మాట్లాడుతూ ప్రతీ రోజు నా శక్తికొలది అన్నవితరణ చేపడుతున్నానని, ఈ రోజు నా కుమార్తెలు, వారి స్నేహితులతో అన్నవితరణ చేపట్టానన్నారు. ఉర్లం. శివతేజ మాట్లాడుతూ చిన్ననాటి నుండే పిల్లలకు సేవా మార్గం, సామాజిక బాధ్యతను తెలియజేయాలని, అప్పుడే భావితరానికి ఏదో ఒక రూపంలో సేవలందిస్తారన్నారు. ఈ రోజు ఆహారాన్ని స్వయంగా విజయ్ కుటుంబ సభ్యులు తయారు చేసి నగరంలో పేదలకు అన్నవితరణ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నైట్ షెల్టర్ నిర్వాహకురాలు, చేయూత మేమున్నాం అధ్యక్షురాలు వైశ్యరాజు. వెంకట లక్ష్మి, షెల్టర్ సేవకులు ఉర్లం శివతేజ, నైట్ షెల్టర్ నివాసకులు నేటి దాత విజయ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబుకు అప్పన్న చందనం ప్రసాదం

## - జర్నలిస్టుల పెండింగ్ సమస్యలపై 11 అంశాలతో వినతి పత్రం

## - సానుకూలంగా స్పందించారన్న గంట్ల






**ఎన్ ఎ డి కొత్త రోడ్, (రాజధాని వార్తలు):** విశాఖ నగర పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు సింహాచలం అప్పన్న చందన ప్రసాదాన్ని సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, నావెల్ డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు అందజేశారు. ఈ మేరకు సోమవారం విశాఖ విమానాశ్రయంలో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలుసుకొని అత్యంత మహిమాన్వితమైన చందన ప్రసాదం శ్రీనుబాబు అందజేయగా ముఖ్యమంత్రి వెంటనే కళ్ళకు అద్దుకొని దానిని స్వీకరించారు. అలాగే జర్నలిస్టులుకు సంబంధించిన 11 పెండింగ్ సమస్యలపై ముఖ్యమంత్రికి శ్రీనుబాబు వినతిపత్రం అందజేశారు. ఇళ్ల స్థలాల సమస్యతో పాటు ప్రధానమైన 11 అంశాలు ఈ వినతిపత్రంలో పొందుపరిచినట్లు శ్రీను బాబు ముఖ్యమంత్రికి విపులంగా వివరించారు. వీటిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నట్లు శ్రీను బాబు తెలిపారు.

# కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు "రాష్ట్ర పురస్కారం"

## - రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కె.శివశంకర్‌కు అరుదైన గౌరవం




**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరు నగరంలో భారతీయ విద్యా భవనంలో నిర్వహించిన పురస్కార ప్రధానోత్సవాలలో ప్రముఖ కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శివ శంకర్‌కు అత్యుత్తమ రక్త ప్రేరకుడి విభాగములో, రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి అరుదైన గౌరవం లభించింది. పురస్కార వేడుకలలో భాగముగా ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా కె.శివశంకర్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత మాట్లాడుతూ ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన పురస్కారాన్ని అందుకోవటం ఆనందంగా ఉందని, భవిష్యత్‌లో కూడా కళాశాల విద్యార్థులకు, ముఖ్యంగా యువతకు రక్తదానం పై అవగాహన కల్పించి ప్రాణదాతలుగా మార్చటంలో భాగమౌతామన్నారు. పురస్కార గ్రహీతకు శ్రీకాకుళం రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహనరావు, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డా.ఎన్.శేషా రెడ్డి, సెక్రటరీ ఎన్. సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డా.బిఈవిఎల్. నాయుడు, కళాశాల డైరెక్టర్ బిఎస్.చక్రవర్తి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

# జేసీఐ శ్రీకాకుళం మెయిన్ సేవలు స్ఫూర్తిదాయకం

## - మజ్జిగతోనే ఉపశమనం : జేసీఐ శ్రీకాకుళం వ్యవస్థాపకులు డా.జామి భీమశంకర్






**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** జేసీఐ శ్రీకాకుళం మెయిన్ సేవలు స్ఫూర్తిదాయకమని, మజ్జికతో ఉపశమనంతో పాటు, ఎంతో ఆరోగ్యకరమని, జేసీఐ శ్రీకాకుళం వ్యవస్థాపకులు డా.జామి భీమశంకర్ అన్నారు. జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన. అనిల్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ ప్రయాణికుల ప్రాంగణంలో డా.చింతాడ. కృష్ణ మోహన్ సహకారంతో సోమవారం మజ్జిక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. జామి బీమా శంకర్ మాట్లాడుతూ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా , జేసీఐ సభ్యుల సమాలోచనతో మజ్జిక సేవ చేశారని, వేసవితో బాటసారులు, ప్రయాణికులు, రిక్షా కార్మికులు, ఆటో చోదకులు, దినసరి కూలీలు ఇబ్బంది పడుతున్నారని, నేటి మజ్జిక సేవ దాత డా.చింతాడ కృష్ణ మోహన్ అందించిన సహకారంతో ప్రయాణికుల దాహాన్ని తీర్చామన్నారు. అధ్యక్షులు కూన అనిల్ కుమార్, కార్యదర్శి తమ్మినేని. ఉష రాణిలు మాట్లాడుతూ జేసీఐ శ్రీకాకుళం మెయిన్ నెలరోజుల పాటు నిరంతర సేవలు కొనసాగిస్తుందని, వీలైనంతవరకు మంచినీళ్లను తరుచుగా తీసుకొని వేసవి ఉపశమనం పొందాలన్నారు.

ఈ కార్యక్రమంలో జేసీఐ శ్రీకాకుళం మెయిన్ సభ్యులు జగదీశ్, డా.చింతాడ.కృష్ణ మోహన్, జేసీ సంతోష్, ఆర్టీసీ ఎస్ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి – వచ్చిన అర్జీలు 282

## - అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అర్జీలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక (పీ.జి.ఆర్.ఎస్)లో కలెక్టర్‌తో పాటు జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యన్నారాయణ రావు, కె.ఆర్.ఆర్.సి. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మిలు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ముందుగా శాఖల వారీగా ఒక్కో శాఖలో పెండింగులో ఉన్న అర్జీలపై కలెక్టర్ విజయ క్రిష్ణన్ సమీక్షించారు. ప్రజల నుండి తీసుకున్న అర్జీల గురించి వెంటనే సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పరిష్కారం కాని అర్జీలపై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని తెలిపారు. అదేవిధంగా డివిజన్, మండల, గ్రామ స్థాయిలలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి సంబంధిత అధికారులు తప్పక హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు అందజేసిన ధరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కరించిన వినతులను ధరఖాస్తుదారునికి తెలియజేయాలని, పరిష్కారం కాని ధరఖాస్తుల గూర్చి వారికి అందుకుగల కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని, ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతిరోజు పర్యవేక్షణ చేసి గడువు లోపల చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి రామారావు, జిల్లా ఎక్సయిజ్ అధికారి వి సుధీర్, జిల్లా పర్యాటక శాఖ అధికారి కె మనో రామ, ఎ పి ఈ పి డి సి ఎల్ ఎస్ ఈ. ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985,
Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan